# విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- బాధ్యతల స్వీకరణ


ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, జూలై 3 : గిరిజనులకు విద్య, వైద్యం అందించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో 61వ పీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుమ్రంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నందున గిరిజన సమస్యలు పూర్తిగా తెలుసన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. మంగళవారం స్థానిక కుమ్రంభీం ప్రాంగణంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోడు భూముల పట్టాలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లోని గిరిజనులకు అందుతున్న విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. సీఆర్టీల నియామకం త్వరలో పూర్తికానున్న నేపథ్యంలో విద్యావ్యవస్థ మరింత పటిష్ట పడనున్నదన్నారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు విధులకు గైరాజరు కాకుండా మూమెంట్ రిజిస్టర్ అమలు చేస్తామని పేర్కొన్నారు. జీసీసీ పెట్రోల్ బంక్ నిర్వహణ సరిగా లేకపోవడంతో పెట్రోల్ దొరకక పడుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకరాగా, సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ పబ్లిసిటీ అధికారి విష్ణు, సిబ్బంది ఉన్నారు.













